క్లుప్తంగా

గజవాహనంపై వెంకటేశ్వరుడు

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వాల్మీకివీధికి చెందిన ఉభయదారులు వ్యవహరించి స్వామి గజవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు గోవింద నామస్మరణతో స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. ఉదయం పూలవీధి, క్రిష్ణ విద్యాలయంవీధి, పోతులప్పవీధి, అప్పారావు తోటకు చెందిన ఉభయదారులుగా స్వామిని చిన్న శేషవాహనంపై ఊరేగించారు. ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు,అర్చకులు గోవర్ధన్‌భట్టార్ పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రామసముద్రం: మండలంలోని కుదురుచీమనపల్లె గ్రామంలో వెలసిన శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం రాత్రి శ్రీ రుక్మిణి సత్యభామ శ్రీవేణుగోపాలస్వామి వారి కళ్యాణోత్సవం, గురువారం ఉట్లోత్సవం, అన్నదాన కార్యక్రమం రాత్రి తొమ్మిది గంటలకు ఆలయం వద్ద పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 28న మంగళవారం రాత్రి అంగరంగవైభవంగా గ్రామ దేవత అయిన గంగమ్మ ఊరేగింపు ఉంటుందన్నారు.

మిట్స్ కళాశాల పరిశోధకులకు ప్రోత్సాహం

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పరిశోధన అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. వివిధ పరిశోధనలలో రాణిస్తున్న కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులకు రూ. 5 లక్షల 30 వేలను ప్రోత్సాహకంగా అందజేసినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ ఆదివారం తెలిపారు. ప్రపంచ స్థాయిలో పేరొందిన వెబ్ ఆఫ్ సైన్స్, స్కోపస్, ఎస్‌సీఐ, ఐఈఈఈ తదితర వాటిలో వీరి పరిశోధన పత్రాలు ప్రచురితం అయ్యాయన్నారు. మరింత ప్రోత్సాహకంగా ఈ నగదు పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



భగవద్గీత పుస్తకాలతో విద్యార్థులు

మదనపల్లె సిటీ: స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి వసంత కుమారి తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భరతనాట్యం, సంగీతం, భగవద్గీత, స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు, అబాకస్ తదితరత అంశాలను ఉచితంగా నేర్పించనున్నట్లు తెలిపారు. అనుభవం కలిగిన విశ్రాంత ఉపాధ్యాయులచే శిక్షణ ఇస్తున్నామన్నారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిటైర్డు అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్ చంద్రయ్య 100 భగవద్గీత పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న లక్ష్మిరెడ్డి

కలకడ : వర్షాకాలంలో దాతల సహకారంతో మొక్కల పెంపకంపై మానవత సంస్థ సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల శాఖ గౌరవ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కలకడ జెడ్పీహైస్కూల్ ఆవరణంలో ఆ సంస్థ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య అధ్యక్షతన నెలవారి సమావేశం నిర్వహించారు. మండలంలో మానవత సంస్థ అందిస్తున్న ఉచిత సేవలను అనేక మంది సద్వినియోగం చేసుకుంటున్నారని, సంస్థ తరఫున మరిన్ని మంచి పనులు చేపట్టాలని సూచించారు. చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు మొక్కలు ఏర్పాటు చేసి పోషించే బాధ్యతను కూడా సంస్థ సభ్యులు తీసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులు గంగాద్రినాయుడు, శ్రీనివాసులురెడ్డి, మండలశాఖ కార్యదర్శి సయ్యద్‌సాహెబ్ , సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



బి.కొత్తకోట: 20 ఏళ్ల క్రితం కళాశాలలో చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆదివారం బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై సమావేశం నిర్వహించుకుని కలుసుకున్నారు. మదనపల్లె శ్రీకృష్ణదేవరాయ కళాశాలలో 2002–04లో ఇంటర్ చదువుకున్న విద్యార్థులు ఆ తర్వాత ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిపోయారు. హార్సిలీహిల్స్‌పై కలుసుకొని సందడి చేశారు.

వైభవం.. లక్ష్మి నరసింహస్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు



రథం ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

మదనపల్లె సిటీ: గోవింద నామస్మరణలతో శ్రీ లక్ష్మి నరసింహస్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు గోవింద నామాలు జపిస్తూ రథం ముందు నడిచారు. మదనపల్లె మండలం సీటీఎంలోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి రథోత్సవం నిర్వహించారు. ఆలయం వద్దనున్న రథంలో స్వామి,అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. రథంలో స్వామి,అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు రథంను వెంటనడిచారు. రథోత్సవం పురస్కరించుకుని భక్తులు రథంపై మిరియాలు, చిల్లర నాణెలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు టెంకాయలు కొట్టి కర్పూరహారతులు ఇచ్చారు. సీటీఎం సర్పంచు ఆనంద్‌పార్థసారధి, ఎంపీపీ రెడ్డమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్ర,వీరప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు

వాల్మీకిపురం: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బాస్కెట్ బాల్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షించారు. ప్రతి ఏడాది బాస్కెట్ బాల్ వేసవి శిబిరాన్ని సొంత నిధులతో నిర్వహిస్తూ, క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తాయన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 8గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది క్రీడాకారులు మంచి ఉద్యోగాలు సంపాధించి, ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. వందమంది శిక్షణ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ రవిచందర్, కోచ్‌లు సాయిభార్గవ్, అంజి, కిరణ్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అంకాలమ్మ జాతర

కలికిరి: మండలంలోని మునెళ్ళపల్లి గ్రామం మూరేవాండ్లపల్లిలో వెలసిన అంకాలమ్మ ఆలయంలో రెండు రోజుల పాటు ఆలయ వార్షికోత్సవ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సంకు రవికుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటల నుంచి గ్రామంలో పోతురాజు ఊరేగింపు, బుధవారం ఉదయం 7 గంటల నుంచి అమ్మవారికి అభిషేకాదులు, మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ, రాత్రి అమ్మవారి గ్రామోత్సవం, 23న ఉదయం అమ్మవారికి గిరిగలు సమర్పణ, అనంతరం నిమర్జనం కార్యక్రమంతో జాతర ముగుస్తుందని ఆయన తెలిపారు. భక్తాదులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పెద్ద మనసు చాటుకున్న పూజారివారిపల్లె వాసులు



అంగళ్లు మల్లయ్యకొండ గోవులకు పశుగ్రాసాన్ని అందించిన పూజారివారిపల్లె గ్రామస్థులు

కురబలకోట: అంగళ్లు మల్లయ్యకొండపై మేత కరువైన మూగజీవాల పరిస్థితి అరణ్యరోదనగా మారింది. మరో వైపు కొండకు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నపాటున నిప్పంటించడంతో కొండలో ఉన్న పచ్చి మేత కాస్తా కాలి బూడిదైంది. దీంతో అక్కడి కొండపై ఉన్న గుడికి తోలిన 40 దాకా ఉన్న గోవులకు గడ్డి కష్టం వెంటాడింది. అంతేకాదు నోరు లేని గోవులు తమ బాధ గోడు గోస వేదనను ఎవ్వరితోను చెప్పుకోలేవు. మాకిది కావాలని మొర పెట్టుకోలేవు. వీటి బాధ వేదనను ఇటీవల సాక్షి దినపత్రిక ద్వారా తెలుసుకుని మండలంలోని తెట్టు గ్రామం పూజారివారిపల్లె గ్రామస్తులు చలించిపోయారు. మేమున్నామని ముందుకు వచ్చారు. ఇంటి వద్ద గాటిలో వారి పశువులను చూసినప్పుడల్లా మల్లయ్య కొండ గోవుల కష్టం గుర్తుకు వచ్చేది. దీంతో వాటికి అండగా నిలిచారు. నెల క్రితం ఊరిలోని వారు కలసి లోడు గడ్డి కొని అంగళ్లు మల్లయ్యకొండ గోవులకు తోలారు. అది అయిపోయి ఉంటుందని ఆదివారం మరో మారు లోడు పశు గ్రాసాన్ని అక్కడి గోవులకు తోలారు. ఇందుకు ఆ ఊరిలోని పురుషులు, మహిళలు, పిల్లలు సైతం 40 మంది దాకా తరలివచ్చారు. కొండపై సహపక్తి భోజనాలు నిర్వహించారు. అతిధులతో పాటు కొండపై ఉన్న దేవుని సేవకులకు కూడా ప్రీతితో వండించారు. ముచ్చటగా మూడోసారి కూడా త్వరలో మరో లోడు పచ్చి మేత ఇక్కడి గోవులకు తోలుతామని కూడా వారు ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తికి చెప్పారు. పూజారివారిపల్లె గ్రామస్థుల పెద్ద మనసును వారి ఉపకారాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

విచిత్ర వేషాలతో చాటింపు

బి.కొత్తకోట: స్థానిక గంగా కామాక్షి అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం భక్తుల విచిత్ర వేషధారణలతో చాటింపు వేయగా ప్రారంభమయ్యాయి. బ్రిటీష్ కాలం నుంచి సాదుచెట్టి సంఘం ఆధ్వర్యంలో ఏటా గంగా కామాక్షి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. మూడురోజుల పాటు జరిపే ఈ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయంతో పాటు వీధులన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. తొలిరోజు భక్తులు విచిత్ర వేషాలతో జాతర చాటింపు వేస్తూ పట్టణంలో అందర్నీ ఆహ్వానించారు. పురుషులు ఆడవేషాల్లో, అమ్మవారి వేషధారణలో ఆకట్టుకున్నారు.

సుందరయ్య యువతకు స్ఫూర్తిదాయకం



పుచ్చలపల్లె సుందరయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మదనపల్లె : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం అని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీనివాసులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, అసమానతను, వివక్షను చిన్ననాడే ఎదిరించినవారు సుందరయ్య అని కొనియాడారు. భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో అగ్రగణ్యుడు, వీరతెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి సారధ్యం వహించి లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన వీరుడుగా అభివర్ణించారు. సైకిల్ పై పార్లమెంటుకు వెళ్ళిన నేత, కమ్యూనిస్టు గాంధీగా పేరుగాంచినవారన్నారు. సుందరయ్య జీవితం ప్రతి ఒక్క రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమణరావు, నాగరాజు, రమణ, సీఐటీయూ నాయకులు నారాయణ, ఖదిర్, న్యాయవాది సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లె సుందరయ్య

పీలేరు : పుచ్చలపల్లె సుందరయ్య నేటి రాజకీయ నేతలకు ఆదర్శప్రాయుడని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి. వెంకటరామయ్య అన్నారు. ఆదివారం పీలేరు పట్టణంలో సీఐటీయూ, హమాలీ కూలీల ఆధ్వర్యంలో పుచ్చలపల్లె సుందరయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగునాట కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన ఆయన కులవ్యవస్థను నిరసించి ఆయన అసలు పేరు సుందరరామిరెడ్డి కాగా తన పేరులో రెడ్డి అనే కుల సూచికను తొలగించుకున్నారని తెలిపారు. నిరాడంబర జీవితం గడిపిన ఆయన స్వాతంత్ర్య సమరంలోని అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని కొనియాడారు. సుందరయ్య ఆశయసాధనకు కార్మికులు, ఉద్యోగులు, కార్మికులందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పురుషోత్తం, నాగరాజ, బాష, వై.ఎస్. మస్తాన్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండపై ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



మల్లయ్యకొండపై ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె మల్లయ్య కొండపైనున్న భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మల్లయ్యకొండను సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారి దర్శనం కల్పించారు. రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని నియోజక వర్గ ప్రజలు ఆయురారోగ్యాలు, పాడిపంటలతో కలకలలాడాలని, అభివృద్ధిలో ముందడుగు వేయాలని స్వామి వారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు అమరనాధరెడ్డి, రెడ్డిమల్ రెడ్డి,రామ్మూర్తి, బాలక్రిష్టారెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన కోసువారిపల్లె సబ్ స్టేషన్ వద్ద ఉన్న ముత్యాలమ్మ తిరునాలకు హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు.

హెచ్ఐవీ బాధితులపట్ల ప్రేమ, సంఘీభావం ఉండాలి



పీలేరు : క్యాండిల్ ప్రదర్శనలో వైద్య ఆరోగ్య సిబ్బంది

పీలేరు : హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులపట్ల ప్రేమ, సంఘీభావం కలిగి ఉండాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ స్మారక దినం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వలన కలిగే శారీరక, సామాజిక ఆర్థిక నష్టాలపై అవగాహన కలిగి, వ్యాధి వచ్చిన తర్వాత బాధ పడేకంటే ఎయిడ్స్ బారిన పడకుండా జీవిద్దామని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, సీహెచ్‌వో జయలక్ష్మీ, కోర్ ప్రాజెక్టు మేనేజర్ సుమలత, ఐసీటీసీ రవి పాల్గొన్నారు.

హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులతో ప్రేమగా మెలగాలి

వాల్మీకిపురం: హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులతో ప్రేమగా మెలగాలని డాక్టర్ శివాని అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఐసిటిసి కౌన్సిలర్ లోకేష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారి పట్ల ప్రేమగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఆర్ఎస్ సంస్థ ప్రతినిధులు లతాంజలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన

మదనపల్లె సిటీ: హెచ్ఐవీతో మృతిచెందిన వారి ఆత్మశాంతి కోసం ఆదివారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఐవీ మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ ఏడాది ప్రేమ, సంఘీభావాన్ని వ్యాప్తి చేయడం నినాదంతో కార్యక్రమం నిర్వహించినట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ కౌన్సిలర్ పుల్లయ్య, ఆర్ఆర్ఎస్ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: హెచ్ఐవీ మృతుల ఆత్మశాంతి కోసం ఆదివారం స్థానిక సీహెచ్‌సీలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ఎల్‌టీ బాలాజీ, స్టాఫ్ నర్సులు రాధ, సుమతి,కృషి మేనేజర్ శ్రీనివాసులు, సావిత్రి, రేఖ, జబీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తిరునాల



బోనాలు తీసుకెళుతున్న మహిళలు

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోటలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి తిరునాల ఆదివారం నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందించారు.

గంగమ్మా.. దీవించమ్మా..!



గంగా జలాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

వాల్మీకిపురం: వాల్మీకిపురం గ్రామ దేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం పట్టణంలోని కోనేటివీధి, నాయక్‌వీధిలోని గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గంధాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన సేవలు నిర్వహించారు. పోతురాజు విగ్రహానికి పూజలు నిర్వహించి, జాతర చాటింపు వేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహిళలు దీలు బోణాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, కమిటీ ఛైర్మెన్ మొగ్రంరెడ్డి రాంకుమార్ రెడ్డి, కేశవ రెడ్డి, బలరాం, విజయవర్మ, పూజారి జనార్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి జాతర



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



చెక్కభజన చేస్తున్న యువకులు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ కట్టుబావిలో ఆదివారం చెన్నకేశవస్వామి జాతర ఘనంగా జరిగింది. ఉదయం స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో స్వామి కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం ఉట్ల తిరుణాల జరిగింది. చెక్కభజనలు, కోలాటలతో యువకులు ఉత్సాహంగా ఉట్లమాను ఎక్కారు. కార్యక్రమంలో కట్టుబావి, పనసమాలకుంట, కొండకిందచాడేపల్లె గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉలవల గంగమ్మ తిరునాల



భక్తులు బోనాలు తీసుకొస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీలో వెలసిన శ్రీ ఉలవల గంగమ్మ తిరునాల ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, కలిశపూజ, నవగ్రహ పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు బోణాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. రాత్రి మదనపల్లెకు చెందిన విజయలక్ష్మీ కలానాట కమండలిచే బాలనాగమ్మ నాటకం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మల్లికార్జున నాయుడు, సాగర్‌రెడ్డి, వెంకటరమణ నాయుడు, హరినాథనాయుడు మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం హరికథా కాలక్షేపం, రాత్రి ఆసాదికథ, చాందినీబండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కల్యాణం .. కమనీయం



స్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలోని చిట్టిఅన్నవరంలోని సత్యనారాయణ స్వామి కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. నుదట కల్యాణ తిలకం.. బుగ్గన చుక్కలతో సర్వాభరణ భూషితుడైన సత్యనారాయణస్వామి పెండ్లి కుమారుడిగా, పద్మావతి అమ్మవారు పెండ్లి కుమార్తెగా శోభిల్లారు. స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాట చేసిన వేదికను సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలతో శోభయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య అర్చకులు, పండితులు వేదమంత్రోచ్చరణతో కళ్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కె.అమరనాథ్, కార్యదర్శి వైద్యం రామకృష్ణ, కోశాధికారి దివాకర్, కుమారస్వామి, శివశంకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లీ ... కరుణించమ్మా..



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా దీవించమ్మా..అంటూ భక్తులు మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు.